క్లుప్తంగా

ముక్కంటి సేవలో అనిత రామచంద్రన్



రాహుకేతు పూజల్లో అనిత రామచంద్రన్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం తెలంగాణ రాష్ట్రం ఆర్పీ అండ్ ఆర్డీ కమిషనర్ అనిత రామచంద్రన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. తొలుత వారు రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. స్వామి,అమ్మవార్ల దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి, స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో గురువారం 298 మంది విద్యార్థులకు వైద్యాధికారి దివాకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. 'గురుకుల విద్యార్థులకు జ్వరాలు' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు వైద్యాధికారి స్పందించారు. గురుకులంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం, అలర్జీ, వంటి చిన్న వ్యాధులున్న వారికి మందులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి కావడంతో బెట్ట జలుబు, జ్వరాలు వస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు బలమైన ఆహారాన్ని తీసుకుని రోగ నిరోధకశక్తి పెంపొందించుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని, స్వచ్ఛమైన నీటిని తాగాలన్నారు. సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కేసుల కొట్టివేత

తిరుపతి సిటీ: తెలుగుదేశం ప్రభుత్వంలో 2017లో ఎస్వీయూ రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన దేవరాజులనాయుడు అవినీతి, అక్రమాలపై గళమెత్తిన వైఎస్ఆర్ సీపీ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలపై నమోదైన అక్రమ కేసులను గురువారం తిరుపతి 4వ ఏడీజే న్యాయస్థానం కొట్టివేసింది. ఈ సందర్భంగా వర్సిటీలో ఆ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అక్రమంగా నాడు టీడీపీ ప్రభుత్వం తమపై నిరాధారమైన కేసులు మోపిందన్నారు. వైఎస్ఆర్ సీపీ విద్యార్థి నాయకుడు వి.హరిప్రసాద్‌రెడ్డి, పోతు మురళీధర్, పి హేమంత్‌కుమార్‌రెడ్డి, డీజే సుధీర్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు శివారెడ్డి, చలపతి, శశి, ఏఐవైఎఫ్ కత్తి, రవి, ఎస్ఎఫ్ఐ అమృతేజ, వసీం అక్రమ్‌తో పాటు 21మందిపై నమోదైన కేసులను కొట్టివేశారు.

సమయపాలన పాటించాలి

వెంకటగిరిరూరల్: వెంకటగిరిలోని పాఠశాలలు సమయపాలన పాటించాలని అలా లేని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వేసవికాలం కారణంగా ప్రభుత్వం నిబంధనల మేరకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాల నిర్వహణ కొనసాగించాలన్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు సాయంత్రం 5గంటల వరకు నిర్వహణ కొనసాగిస్తున్నట్లు సమాచారమన్నారు. ఈ మేరకు ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

నేడు వేలం పాటలు

దక్కిలి: మండలంలోని వెలుగొండలు కింద ఆముదూరు పంచాయతీలోని కొలితోటలో వెలిసియున్న చెంచమ్మ ఆలయం వద్ద వివిధ హక్కుల లీజు కోసం శుక్రవారం మధ్యాహ్నం 12.05 గంటలకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆసక్తి గల వారు ఆలయంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. లీజు కాలపరిమితి ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు ఉంటుందని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

సరిహద్దు జిల్లాల చెక్‌పోస్ట్ ఏర్పాటు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సైదాపురం: మండల కేంద్రం సమీపంలోని కైవల్యానది రోడ్డు వద్ద సరిహద్దు జిల్లాల చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ డీఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఈ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. అనంతరం పలు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ త్వర లో జరగబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

సంక్షేమ పథకాలే విజయ సోపానాలు

- వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాల అభ్యున్నతి
- ప్రచారంలో బియ్యపు పవిత్రారెడ్డి



ఇంటింటి ప్రచారంలో పవిత్రారెడ్డి



రావిళ్లవారికండ్రిగలో పథకాల లబ్ధిని వివరిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి విజయ సోపానాలని పార్టీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రావిళ్లవారికండ్రిగ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఏ ఇంటి వద్దకు వెళ్లినా అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్ని విధాలా లబ్ధిపొందామని, తమ మద్దతు వైఎస్సార్ సీపీకేనని చెబుతుండడం సంతోషంగా ఉందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో దశాబ్దాల తరబడి గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని, నేడు జగనన్న పాలనలో గ్రామాల్లో ఊహించని అభివృద్ధి జరిగిందన్నారు. జగనన్న ప్రభుత్వం మళ్లీ వస్తేనే సంక్షేమం సాధ్యమని తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో 30 సంవత్సరాల అభివృద్ధిని చేసి చూపారని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు జమల్ల శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి, సర్పంచ్‌లు రాధాకృష్ణ, మోహనప్రియ, ఎంపీటీసీ సభ్యురాలు సావిత్రమ్మ, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు గోపీ యాదవ్, రాజశేఖర్, సుబ్రమణ్యం, అయ్యప్పరెడ్డి, సోము యాదవ్, సురేష్ యాదవ్, తులసి, అభిలాష నాయుడు, లోకనాథరెడ్డి, సురేఖ, గుణశేఖర్ నాయుడు, రాంబత్తెయ్య, వెంకటరమణ నాయుడు మునిరత్నం నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి

సత్యవేడు: నియోజకవర్గకేంద్రంలో శుక్రవారం జరిగే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎంపీపీ వి.ప్రతిమ నివాసం వద్ద పార్టీ మండల శ్రేణులు సమావేశమ య్యారు. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు పట్టణంలోని భేరిశెట్టి కల్యాణ మండపం సమీపంలో జరిగే బహిరంగ సభకు ఎంపీ గురుమూర్తి, సత్యవేడునియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ హాజరవుతారని తెలిపారు. ఆత్మీయ సమావేశం సభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, సచివాలయాల సమన్వయకర్తలు, బూత్ కమిటీల సభ్యులు, గృహసారథులు, పలు సంఘాల మహిళలు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని సుశీల్‌కుమార్ రెడ్డి కోరారు. అంతకు ముందు సభ ఏర్పాట్లుపై చర్చించారు. సింగిల్ విండో చైర్మన్ కేవీ నిరంజన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్‌రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, జిల్లా మహిళా సభ్యురాలు మస్తానీ పార్టీ నాయకులు పగడాల రమేష్, శేఖర్, శ్రీనివాసులు రెడ్డి, మధుసూధన్‌రావు, ఈ.గోవింద స్వామి, పరందాం, రూబెన్, సన్యాసయ్య, వెంకటేశన్, సుధాకర్, శరవణన్, జయ, రాబర్టు, కమల్, మాణిక్యం, చిన్నబ్బ, పళణి, సురేష్, సోము తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంపై దిశా నిర్దేశం

నారాయణవనం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ గురుమూర్తి, వైఎస్సార్ సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ శుక్రవారం మండలంలో పర్యటించనున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సొరకాయలు తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక సొరకాయలస్వామి కల్యాణ మండలంలో నిర్వహించే సభలో వారు ముఖ్య అతిథులు పాల్గొని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎన్నికల ప్రచారంపై దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దేశానికే ఆదర్శం జగనన్న పథకాలు



అమరనాథ్‌రెడ్డితో నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని సైకిల్‌యాత్ర అభిమాని అమరనాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని కైవసం చేసుకోవాలనే ఆకాంక్షతో మోటారు సైకిల్ ప్రచార యాత్ర చేస్తున్న వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు మండల కొత్తపేట గ్రామానికి అమరనాథ్‌రెడ్డి గురువారం మండలంలోని పల్లమాల గ్రామం వద్దకు చేరుకున్నారు. ఇక్కడ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నలగోపాల్‌రెడ్డి, నాయకులు కిరణ్‌యాదవ్, యుగంధర్‌రెడ్డి ఆయనను కలిశారు. అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ, అన్ని నియోజకవర్గాలల్లో పర్యటిస్తానని తెలిపారు. ఎన్నికలయ్యే వరకు యాత్ర కొనసాగిస్తానని తెలిపారు.

మామండూరులో క్యాన్సర్ వైద్య శిబిరం

రేణిగుంట: మండలంలోని మామండూరు పంచాయతీ బాలపల్లెలో గురువారం రాస్, టాటా ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్యులు బీపీ, షుగర్, హెపటైటిస్ బీ, సీ, నోటి క్యాన్సర్, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌లకు సంబంధించి అన్ని పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. సరైన ఆహార పద్ధతులను అవలంభించడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని రాస్ మహిళాజ్యోతి మ్యూచువల్ ఫండ్ ట్రస్టీలు రమేష్ రెడ్డి, సుజాత, టాటా ట్రస్ట్ అధికారి హేమంత్‌కుమార్ వెల్లడించారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

తిరుపతి కల్చరల్: ఏర్పేడు మండలం, కోబాక గ్రామ పంచాయతీ మిట్ట, ఎస్సీ ఎరుక కాలనీలోని తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకుంటూ తమను బెదిరిస్తున్న ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఎస్టీ కాలనీకి చెందిన బాధితులు జి.రామసుబ్బమ్మ, జి.వెంకటేశ్వర్లు, నాగయ్య మాట్లాడారు. ఏర్పేడు మండలం, కోబాక గ్రామ పంచాయతీ మిట్టలో 15 కుటుంబాలు నివాసముంటూ బతుకుతున్నామన్నారు. ఇదే కాలనీలో 40 ఏళ్ల క్రితం వెంకటయ్య కుటుంబం భూమి లేకపోయినా గుడిసెలు వేసుకుని ఉండేవారని, అయితే ఉద్యోగ రీత్యా గ్రామం వదలి వెళ్లిపోయారన్నారు. అయితే కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వెంకటయ్య కుమారుడు అరుణ్ కాలనీలోని తమ నివాస స్థలాలను దౌర్జన్యంగా కబ్జా చేసి ఆక్రమించుకుంటున్నారని, దీనిపై ప్రశ్నించిన తమపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళితే రెవెన్యూ అధికారులు వచ్చి పరిశీలించి కాలనీలో భూమి ఆక్రమణను అరికట్టేందుకు ప్రయత్నించినా ఎదురు దాడికి దిగుతూ బెదిరిస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధిలో ఒరవ కాలువ మరమ్మతులు



పనులు చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామంలోని పంట పొలాలకు నీరందించే ఒరవ కాలువ మరమ్మతు పనులను ఉపాధి హామీ పథకం కింద చేస్తున్నారు. పనులు జోరుగా సాగుతున్నాయి. 120 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఈ పనితో పాటు భూముల అభివృద్ధి, చెరువుకట్టపై చెట్టు పుట్టలను తొలగించడం వంటి పనులను చేస్తున్నారు. ఈపనులు నెలరోజులపాటు చేస్తామని ఏపీఓ భానుప్రియ తెలిపారు. కూలీలకు రోజుకు రూ.250లు కూలీ గిట్టుబాటు అవుతోందన్నారు.

ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన



అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి హరీష్

సత్యవేడు: ఓటర్లు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించు కొనేలా సంసిద్ధం చేయాలని సోషల్ మీడియా నోడల్ అధికారి హరీష్ కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఓటర్లను సంసిద్ధం చేయడంపై(స్వీప్) పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఓటర్లకు అవగాహన కల్పించడంలో భాగంగా స్వీప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం తీసుకువచ్చిన సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల ప్రచారంలో, ఎన్నికల సమయంలో జరిగే అవకతవకలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారం అవుతుం దన్నారు. కోడ్ ఉల్లంఘన జరిగితే ఫిర్యాదు ఎలా చేయాలి అన్న విషయంపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి కమిటీలు ఏర్పాటైనట్లు తెలిపారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్ తదితర మాధ్యమాల ద్వారా స్వీప్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈఓపీఆర్డీ మునిరవికుమార్ పాల్గొన్నారు.

నియమావళిపై గ్రామీణులకు అవగాహన



మాట్లాడుతున్న సీఐ మల్లికార్జున

రేణిగుంట:రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున సూచించారు. మండలంలోని మామండూరులో గురువారం రాత్రి ఎన్నికల నియమావళిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రాజకీయ పార్టీలు ఏవైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. కోడ్ నిబంధనలను వివరించారు. అక్రమ మద్యం నిల్వలు, కానుకల పంపిణీ కోసం ఎక్కడైనా వస్తు సామగ్రిని డంప్ చేసి ఉంటే తెలపాలన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురి చేయడం, నిర్బంధించినా వెంటనే డయల్ 100కు తెలపాలని కోరారు. ఎస్ఐ అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

నాయుడుపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మేనకూరు గ్రామానికి చెందిన కట్టా దొరస్వామి, హైమావతి(27) దంపతులు ఈనెల 19 తేదీ వారి కుమారుడికి ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో ఆస్పత్రికి వెళ్లేందుకు బైక్‌లో నాయుడుపేటకు బయలుదేరారు. మార్గమధ్యలో నాయుడుపేట సమీపంలో బైక్ వెనుక కూర్చొని ఉన్న హైమావతి అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు సమాచారం అందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



కారిపాకంలో బీఎస్ఎఫ్, పోలీసుల కవాతు

వరదయ్యపాళెం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సత్యవేడు సీఐ దివాకర్‌రెడ్డి సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. గురువారం మండలంలోని కంచరపాళెం, కారిపాకం గ్రామాల్లో బీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు భద్రత కల్పిస్తున్నట్లు భరోసా ఇచ్చేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎస్ఐ ప్రతాప్, ఏఎస్ఐ షణ్ముగం, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో పీఓలే కీలకం



మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి, శిక్షణకు హాజరైన పీఓ, ఏపీఓలు

ఏర్పేడు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో పీఓల పాత్రే ఎంతో కీలకమని శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో శ్రీకాళహస్తి నియోజక వర్గ ఎన్నికల నిర్వహణకు నియమితులైన పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను పగడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు ఎన్నికలు కొత్తగా చూడాలని, ఈ ఏడాది ఎన్నికల్లో పలు కొత్త అంశాలు, సూచనలు ఉన్నాయని సూచించారు. పీఓలు హ్యాండ్ బుక్ పూర్తిగా చదివి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ఎన్నికల నిర్వహణ సులభ తరమవుతుందన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

దక్కిలి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కల్పలత, పరిమళ పేర్కొన్నారు. మార్లగుంట, నాగులపాడు గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని గురువారం ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కల్పలత, పరిమళ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గర్భిణులు, బాలింతలు, టీహెచ్ఆర్ పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చిన్నారుల ఆట వస్తువులను ప్రదర్శించారు.

కండలేరులో 8.530 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం 8.530 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 500 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 20, హైలెవల్ కాలువకు 115, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

- సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ ఘటనను ఛేదించిన పోలీసులు
- నిందితులంతా పాత నేరస్తులే
- ఇద్దరి కోసం ముమ్మర గాలింపు



వివరాలు వెల్లడిస్తున్న కావలి డీఎస్పీ వెంకటరమణ

కావలి: పట్టణంలోని తుమ్మలపెంట్ రోడ్డులో సెల్‌ఫోన్ దుకాణంలో జరిగిన చోరీ కేసును ఒకటవ పట్టణ పోలీసులు ఛేదించారు. గురువారం కావలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.వెంకటరమణ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని సెల్‌ఫోన్ దుకాణంలో ఈనెల 17న తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షట్టర్ తాళాలు పగులగొట్టి రూ.2 లక్షల విలువైన 17 సెల్‌ఫోన్లు, రెండు బ్లూటూత్ స్పీకర్‌లు, ఒక సెక్యూరిటీ కెమెరాను చోరీ చేశారు. అనంతరం మరో రెండు దుకాణాల్లో చోరీకి విఫల యత్నం చేసి బొలెరో వాహనంలో పారిపోయారు. దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించిన సెల్‌ఫోన్ షాప్ యజమాని కావలి ఒకటవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. నాయుడుపేట ప్రాంతంలో చోరీలకు పాల్పడుతున్న పాతనేరస్తుల ముఠా పనే అనే విషయం బయటపడింది. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. పక్కా సమాచారంతో చిల్లకూరు మండలం తిమ్మనగర్‌పాళేనికి చెందిన యనమల సూర్యతేజ, కోట మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన చిట్టేటి వినయ్‌కుమార్, గూడూరు గాంధీనగర్‌కు చెందిన నాగేండ్ల శ్రీహరిని అదుపులోకి తీసుకున్నారు. సెల్‌ఫోన్లతోపాటు బొలెరో వాహనం, నాయుడుపేటలో చోరీ చేసిన 15 లీటర్ల వంటనూనె క్యాన్లు మూడు, కేజీ వంట నూనె ప్యాకెట్లు 32 స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నాగరాజు, మీర్జావలి అనే మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. కావలి ఒకటవ పట్టణ సీఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక చైతన్య గొంతుక

- నాగలి కూడా ఆయుధమే పుస్తక పరిచయ కార్యక్రమంలో వక్తలు ఉద్ఘాటన



పుస్తకాన్ని పరిచయం చేస్తున్న అతిథులు, వక్తలు

తిరుపతి కల్చరల్: సమకాలీన సామాజిక చైతన్య గొంతుకగా నాగలి కూడా ఆయుధమే పుస్తకం నిలుస్తుందని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ఈ తరం కవితా వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం యూత్ హాస్టల్లో కవి కొమ్మవరపు విల్సన్‌రావు కవితా సంపుటి అయిన నాగలి కూడా ఆయుధమే పుస్తకం పరిచయ సభ ఘనంగా నిర్వహించారు. ఈ తరం కవితా వేదిక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్వేత డైరెక్టర్ భూమన్, పుస్తక సమీక్షకుడిగా ఓఆర్ఐ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, విశిష్ట అతిథిగా మహిళా వర్సిటీ తెలుగు శాఖాధిపతి డాక్టర్ వై.సుభాషిణి హాజరయ్యారు. నాగలి కూడా ఆయుధమే పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ సందర్భంగా సమకాలీన సామాజిక వాస్తవిక అంశాలు, మానవీయ విలువలపై మాట్లాడిన కవిత్వంగా వారు పేర్కొన్నారు. భూమన్ మాట్లాడుతూ మానవ చైతన్యాన్ని కాంక్షిస్తున్న కవిగా విల్సన్‌ను అభివర్ణించారు. డాక్టర్ వై.సుభాషిణి మాట్లాడుతూ అమానవీయత మీద ఎక్కుపెట్టిన కవితాస్త్రంగా నాగలి కూడా ఆయుధమే పుస్తకమని తెలియజేశారు. పుస్తక సమీక్షకుడు పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాగలి కూడా ఆయుధమే పుస్తకంలోని కవిత్వాన్ని, కవి రచనా శైలిని కొనియాడారు. రచయితలు ఆర్సీ కృష్ణస్వామి రాజు, పల్లిపట్టు నాగరాజు, డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, సాకం నాగరాజు, డాక్టర్ రాసాని, మూరిశెట్టి గోవింద్ తదితరులుపాల్గొన్నారు.